నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 | కరీంనగర్, మంగళవారం 5 నవంబర్ 2024 | KARIMNAGAR

- పాఠశాల సమయానికి బస్సులు నడపండి



కథలాపూర్ మండలంలోని తాండ్ర్యాల, గంభీర్‌పూర్ గ్రామాల రూట్‌లో పాఠశాల సమయానికి బస్సులు నడపాలని కోరుతూ కోరుట్ల-వేములవాడ రోడ్డుపై కథలాపూర్ మండలకేంద్రంలో మోడల్ స్కూల్ విద్యార్థులు సోమవారం సాయంత్రం ధర్నా చేశారు. దీంతో రోడ్డుకిరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ఎస్ఐ నవీన్‌కుమార్ వచ్చి ఆర్టీసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. **-కథలాపూర్, నవంబర్ 4**

# ప్రతి ఇంటికీ నీరందించేందుకే 'అమృత్'

- ఈ పథకంలో 1.34 కోట్ల కనెక్షన్లు అందించాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



*నగరంలో మంచి నీటి సరఫరా అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్*

కరీంనగర్ కార్పొరేషన్, నవంబర్ 4 : ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ అందించాలన్న ఆలోచనతోనే అమృత్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఫిల్టర్‌బెడ్‌లో ₹147 కోట్ల వ్యయంతో చేపట్టనున్న మంచినీటి సరఫరా పనులను సోమవారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 1.34 కోట్ల ఇళ్లకు నీటి కనెక్షన్లు అందించడంతోపాటు 1.02 లక్షల మురుగునీటి కనెక్షన్లు ఇచ్చామని వెల్లడించారు. అమృత్-2 పథకంలో ₹2.99 లక్షల కోట్లు కేటాయిస్తామని తెలిపారు. తెలంగాణకు అమృత్ 1, 2 కింద ₹6876 కోట్లను అందించామన్నారు. నగరాభివృద్ధికి సహకరిస్తామని, రాజకీయాల కంటే అభివృద్ధే ముఖ్యమని, ఎన్నికల వరకే రాజకీయాలు మాట్లాడాలని సూచించారు. పగలు, పంతాలకు పోతే అభివృద్ధి చేయలేమని పేర్కొన్నారు. అతి త్వరలో కొండగట్టు, వేములవాడ, ఇల్లందకుంట ఆలయాలను టెంపుల్ సర్క్యూట్ పరిధిలోకి తీసుకొచ్చి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కరీంనగర్‌లోని టీటీడీ దేవాలయ నిర్మాణం కోసం టీటీడీ చైర్మన్‌తో మాట్లాడినట్లు తెలిపారు.

## రోజూ నీటి సరఫరా జరిగే ఏకైక నగరం

- **ఎమ్మెల్యే గంగుల కమలాకర్**


రాష్ట్రంలో ప్రతి రోజూ మంచినీటి సరఫరా జరిగే ఏకైన నగరం కరీంనగర్ అని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. అన్ని పార్టీలు పాల్గొంటున్న కార్యక్రమం ఇదేనని పేర్కొన్నారు. ఎన్నికలప్పుడు ఎన్ని ఉన్నా ప్రజా సేవ కోసం, అభివృద్ధి చేయాలన్న ఆలోచనతోనే తాము పని చేస్తున్నామని పేర్కొన్నారు. గత పదేళ్లలో నగరంలో 24 గంటలపాటు మంచినీటి సరఫరా చేయాలన్న ఆలోచనతో ముందుకు సాగామన్నారు. అందులో భాగంగా ప్రస్తుతం ప్రతి రోజూ సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. అమృత్ కింద చేపడుతున్న పనులతో విలీన గ్రామాల్లోనూ ప్రతి రోజూ మంచినీటి సరఫరా చేసే అవకాశం ఉంటుందన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ పనులను కేంద్రంలోని టూరిజం విభాగంలో పూర్తి చేసే బాధ్యతను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీసుకోవాలని కోరారు. ఇది పూర్తయితే నగరానికి పర్యాటక శోభ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు అంతంతే

- రేపటితో ముగియనున్న గడువు
- గతంతో పోలిస్తే పెరిగిన పట్టభద్రుల ఓట్లు
- అయినా ఆశించిన స్థాయిలో ఎన్‌రోల్‌మెంట్ కాలేదన్న అభిప్రాయం
- 2019తో పోలిస్తే నమోదులో వెనుకబడ్డ ఉపాధ్యాయులు
- ఎన్‌రోల్‌మెంట్ గడువు పెంచాలన్న విజ్ఞప్తులు
- ఇంకా స్పష్టత ఇవ్వని ఎన్నికల సంఘం
- అర్హులను గుర్తించేందుకు అధికారుల కసరత్తు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే అత్యధిక నమోదు

**కరీంనగర్- మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఓటర్ నమోదుకు గడువు ముంచుకొస్తున్నది. ఎన్నికల సంఘం ప్రకటించిన ప్రకారం మరో 48 గంటల్లో ఈ సమయం ముగియనున్నది. అయితే ఈ రెండు స్థానాలకు ఆశించిన స్థాయిలో ఎన్‌రోల్‌మెంట్ జరుగలేదని తెలుస్తున్నది. బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపుతున్న అభ్యర్థులు, ఇదే సమయంలో 15 జిల్లా అధికారులు ఓటర్ నమోదుపై అవగాహన కల్పిస్తున్నా.. అంచనాలకు అనుగుణంగా నమోదు ప్రక్రియ జరగడం లేదు. 2019 ఎమ్మెల్సీ ఎన్నికలతో పోలిస్తే పట్టభద్రుల స్థానంలో ఈ సారి దరఖాస్తుల సంఖ్య పెరిగినట్టు కనిపిస్తున్నా.. మరింత పెరగాల్సిన అవసరమున్నది. ఇక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విషయంలో గతంలో కన్నా ఈసారి తక్కువ ఓటర్ నమోదైంది. ఔత్సాహిక అభ్యర్థులు ఎవరికి వారే ఓటర్ నమోదును పెంచేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో గడువు పెంచాలంటూ విజ్ఞప్తులు వస్తుండగా, ఎన్నికల సంఘం మాత్రం ఇంకా స్పష్టత ఇవ్వలేదు.**





కరీంనగర్, నవంబర్ 4 (నమస్తేతెలంగాణ ప్రతినిధి) : కరీంనగర్-మెదక్, నిజామాబాద్- ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. నిజానికి 2019లో జరిగిన ఎన్నికల్లో ఈ స్థానాల నుంచి గెలుపొందిన అభ్యర్థుల పదవీ కాలం వచ్చే మార్చితో ముగియనున్నది. ఈ పరిస్థితులను పరిగణలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, రెండు స్థానాలకు ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను చేపట్టింది. ఇది ఈ నెల 6వ తేదీతో గడువు ముగియనున్నది. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం నాటికి జరిగిన ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ చూస్తే.. రెండు స్థానాలకు ఆశించినంతగా జరగలేదు. 2019లో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరిగిన సమయంలో 17 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. అప్పుడు 1,96,321 మంది ఓటు నమోదు చేసుకున్నారు. ఆ ఎన్నికల్లోనే చాలా మంది పట్టభద్రులు తమ పేర్లను నమోదు చేసుకోలేదు. ప్రస్తుతం కూడా అలాంటి పరిస్థితే కనిపిస్తున్నది. గడిచిన ఐదేళ్లలో కొత్తగా లక్షలాది మంది విద్యార్థులు పట్టాలు పుచ్చుకున్నారు. ఈ సారి ఓటరు నమోదు గడువు ముగిసే నాటికి సుమారు 3 నుంచి 3.50 లక్షలకు ఎన్‌రోల్‌మెంట్ పెరుగుతుందని అధికారులు అంచనాలు వేశారు. సోమవారం మధ్యాహ్నం వరకు చూస్తే ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని 15 జిల్లాల్లో 2,35,576 మంది పట్టభద్రులు తమ ఓటు ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారు. అందులో 2,34,241 ఆన్‌లైన్, 1,335 ఆఫ్‌లైన్ దరఖాస్తులొచ్చాయి. 2019 ఎన్నికలతో పోలిస్తే పట్టభద్రుల స్థానంలో కొంత మేరకు ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ పెరిగినట్టు కనిపిస్తున్నా ఆశించిన స్థాయిలో జరగలేదు. అంతేకాదు, ఈ సారి ఓటర్ నమోదు ప్రక్రియను పెంచేందుకు ఈస్థానంలో పోటీ పడుతున్న చాలా మంది అభ్యర్థులు తమ సొంత ప్రయత్నాలు చేశారు. ఎవరికి వారే కొంత మంది సిబ్బందిని ప్రత్యేకంగా నియమించి.. మిస్డ్ కాల్ చేస్తే చాలు ఎన్‌రోల్‌మెంట్ చేస్తామంటూ ప్రకటనలు ఇచ్చారు. అక్కడితో ఆగకుండా హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు కట్టారు. మరికొంత మంది అభ్యర్థులు తమ సిబ్బంది ద్వారా పట్టభద్రుల వివరాలు, సర్టిఫికెట్లు సేకరించి ఎన్‌రోల్‌మెంట్ చేశారు. అభ్యర్థులు చూపిన చొరవ వల్లే ఈ మాత్రం జరిగిందని, లేదంటే గతం లోకన్నా తగ్గేదన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

## టీచర్ ఎమ్మెల్సీ నమోదు కూడా నిరాశాజనకమే

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్‌రోల్‌మెంట్ కూడా నిరాశ జనకంగా ఉంది. 2019 ఎన్నికల్లో ఏడుగురు అభ్యర్థులు పోటీ పడ్డారు. అప్పుడు మొత్తం 23,214 మంది ఉపాధ్యాయులు ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారు. అందులో 7,322 మంది మహిళా టీచర్లు, 15,892 మంది పురుష ఓటర్లున్నారు. ఈ సారి ఎన్‌రోల్‌మెంట్ మరో నాలుగు నుంచి ఐదు వేలు పెరుగుతుందని అంచనా వేశారు. కానీ, సోమవారం మధ్యాహ్నం వరకు చూస్తే నియోజకవర్గంలో 16,150 మంది ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. పట్టభద్రుల ఎన్‌రోల్‌మెంట్‌తో పోలిస్తే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్‌రోల్‌మెంట్‌పై ఔత్సాహిక అభ్యర్థులు పెద్దగా శ్రద్ధ పెట్టకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**సోమవారం (4నవంబర్) మధ్యాహ్నం 12 గంటల వరకు వచ్చిన దరఖాస్తుల వివరాలు**

| జిల్లా | టీచర్ ఎమ్మెల్సీ వచ్చిన దరఖాస్తులు | గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కోసం వచ్చిన దరఖాస్తులు |
|---|---|---|
| కుమ్రం భీం | 3,305 | 179 |
| మంచిర్యాల | 19,931 | 637 |
| ఆదిలాబాద్ | 9.414 | 662 |
| నిర్మల్ | 12,269 | 997 |
| నిజామాబాద్ | 16,574 | 2,007 |
| కామారెడ్డి | 7,613 | 1,432 |
| జగిత్యాల | 24,386 | 1.306 |
| పెద్దపల్లి | 19,948 | 446 |
| కరీంనగర్ | 53,937 | 2,476 |
| రాజన్న సిరిసిల్ల | 15,167 | 442 |
| సంగారెడ్డి | 19,057 | 2,080 |
| మెదక్ | 8,776 | 784 |
| సిద్దిపేట | 21,508 | 2,632 |
| హనుమకొండ | 2,607 | 99 |
| జయశంకర్ భూపాల్‌పల్లి | 1,534 | 49 |
| మొత్తం | 2,35,576 | 16,150 |

## వేడెక్కుతున్న వాతావరణం

ఇటు పట్టభద్రులు, అటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 15 జిల్లాల్లో హీట్ పెరిగింది. ఎవరికి వారే ఆయా స్థానాల్లో తమ వ్యూహాలకు పదును పెడుతూ ముందుకు సాగుతున్నారు. ప్రధానంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కించుకునేందుకు ఈసారి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు బరిలో ఉండే అవకాశం కనిపిస్తున్నది. ప్రతి జిల్లా నుంచి కొంతమంది వివిధ పార్టీల నుంచి మద్దతు ఆశిస్తుండగా.. మరికొంత మంది స్వతంత్రులుగా బరిలోకి దిగి వారి సత్తా చాటేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. అందులో భాగంగానే తమ అనుకున్న కుటుంబాల్లో పట్టభద్రులు ఎక్కడుంటే అక్కడ వారి ఓటు ఎన్‌రోల్‌మెంట్ అయ్యేలా చూస్తున్నారు. అంతేకాదు, ఈ సారి చాలా మంది అభ్యర్థులు ఒక అడుగు ముందుకేసి, ఎవరికి వారే తమ మేనిఫెస్టోను విడుదల చేస్తున్నారు. తమను గెలిపిస్తే ఏమిచేస్తారో ముందుగానే ఓటర్లకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు. సాధ్యమైనంత వరకు వ్యక్తిగతంగా కలుస్తూ.. ఫోన్లు చేసి మాట్లాడుతూ ఓటు అభ్యర్థిస్తున్నారు. దీంతో ఎమ్మెల్సీ స్థానం పరిధిలో ఎన్నికల వాతావారణం రోజురోజుకూ వేడెక్కుతున్నది. ప్రధాన పార్టీలు మాత్రం నేటికి వారి అభ్యర్థులను డిక్లేర్ చేయలేదు. పలువురు అభ్యర్థులు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ వంటి పార్టీల మద్దతు కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఆయా పార్టీల మద్దతు ఎవరికి దక్కుతుందన్న విషయంపై ఆసక్తి నెలకొన్నా, ఎన్నికలు జరగడానికి ఇంకా సమయం ఉండడంతో ఇప్పుడే ప్రధాన పార్టీలు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వకపోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన పార్టీలన్నీ తమ అభ్యర్థులను డిసెంబర్‌లో లేదా సంక్రాంతి తర్వాత గానీ వెల్లడించ వచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇటు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకొని వెరిఫికేషన్ చేస్తున్నారు. సదరు పట్టభద్రులు, టీచర్లు సమర్పించిన సర్టిఫికెట్లు నిజమేనా..? లేదా..? అన్న వివరాలు సేకరించి వాటి ఆధారంగా ఓకే చేస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగా లేని అనేక దరఖాస్తులను రిజెక్టు చేస్తున్నారు. సంబంధిత వ్యక్తులకు సమాచారం ఇస్తున్నారు.

## గడువు పెంచుతరా..?

ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం చూస్తే రెండు ఎమ్మెల్సీ స్థానాల ఓటరు నమోదుకు ఈ నెల 6న గడువు ముగియనున్నది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఏదైనా సరే రేపటి రాత్రి వరకే దరఖాస్తు చేసుకునే అవకాశమున్నది. అయితే ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు అంచనాలకు అనుగుణంగా ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ జరగలేదన్న అభిప్రాయాలు అన్ని జిల్లాల్లోనూ వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ గడువు పెంచాలన్న విజ్ఞప్తులు ఎన్నికల సంఘానికి వెళ్తున్నాయి. పరిస్థితులపై ఎన్నికల సంఘం కూడా విశ్లేషణ చేస్తున్నట్టు తెలుస్తున్నది. అంతేకాదు, అంచనాలకు అనుగుణంగా ఏయే జిల్లాల్లో ఎన్‌రోల్‌మెంట్ కాలేదు, అందుకు కారణాలు ఏమిటీ అన్న కోణంలోనూ వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం. ఈ పరిస్థితుల్లో ఎన్నికల సంఘం గడువు పెంచుతుందా..? లేదా..? అన్న ఉత్కంఠ నెలకొనగా.. విశ్వసనీయ వర్గాల ప్రకారం గడువు పొడిగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తున్నది.

- **ఎములాడకు ఎనభై వేలకు పైగా..**



కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో రాజన్న క్షేత్రం భక్తులతో పోటెత్తింది. సుమారు ఎనభై వేలకు పైగా భక్తులు దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా రాజన్నకు సుమారు రూ.38 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి పర్యవేక్షణలో అధికారులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. **-వేములవాడటౌన్, నవంబర్ 4**

# 'పాకి' పనుల లెక్కల్లోనూ పరేషానే



- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా స్కావెంజర్లను నియమించాలని ప్రభుత్వ నిబంధనలు
- ఎందరు పిల్లలున్నా ఒక్కరే చాలంటూ జగిత్యాల సార్ల ఆదేశాలు
- జీవో నిబంధనలకు, పెద్ద సార్ల ఆదేశాలకు కుదరని పొంతన
- తలలు పట్టుకుంటున్న ఉపాధ్యాయులు

**సర్కారు ఆదేశాలు ఒకలా.. పెద్ద సార్ల ఆదేశాలు మరోలా**

**ప్రభుత్వ పాఠశాలల 'పాకి' పనుల్లోనూ జగిత్యాల జిల్లా శాఖ అధికారులు పరేషాన్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రకటన నేపథ్యంలో స్కూళ్ల పరిశుభ్రతే లక్ష్యంగా జూలైలో ప్రభుత్వం జారీ చేసిన జీవోకు అనుగుణంగా ముందుకు సాగాల్సింది పోయి, దానిని పక్కకు పెట్టి సొంత రూల్‌ను అమలు చేస్తున్నారు. పిల్లల సంఖ్య ఆధారంగా స్కావెంజర్లను నియమించుకొని ₹3వేల నుంచి ₹20వేల వేతనం ఇవ్వాలని, అది కూడా ఆగస్టు నెల నుంచే పరిగణలోకి తీసుకోవాలని సర్కారు స్పష్టం చేయగా, ఆదేశాలను తుంగలో తొక్కేశారు. ఎంతమంది పిల్లలు ఉన్నా ₹3వేల శాలరీ మాత్రమే ఇవ్వాలని, అది కూడా నవంబర్ నుంచే అని చెప్పడంతో హెచ్ఎంలు హతాశులవుతున్నారు. సర్కారు ఆదేశాలు ఒకలీతిలో, పెద్ద సార్ల ఆదేశాలు మరోలా ఉండడంతో ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.**

జగిత్యాల, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): 'పాఠశాలల్లో పరిశుభ్రత అత్యంత ప్రధానమైన అంశం. మరుగుదొడ్లను శుభ్రం చేసే వారు లేక కంపు కొడుతున్నాయి. ఉపాధ్యాయులు, పిల్లలు, ముఖ్యంగా ఆడపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందుకే రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించుకునేందుకు ఆదేశాలు ఇస్తున్నాం. వీరికి ప్రభుత్వమే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా వేతనాలు చెల్లిస్తుంది. తక్షణమే నియామకం చేపట్టండి' రాష్ట్ర ముఖ్యమంత్రి గత జూలైలో చేసిన ప్రకటన ఇది. ఆయన ఆదేశాలతోనే స్కావెంజర్ల నియామకం కోసం రాష్ట్ర విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి అదే నెల 30న జీవో 21ను జారీ చేశారు.

## జీవో 21 ఏం చెబుతోంది?

జీవో 21 ద్వారా స్కావెంజర్ల నియామకానికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం ప్రకటించింది. స్కూల్ ఫెసిలిటి మెయింటనెన్స్ గ్రాంట్ ద్వారా స్కావెంజర్లకు వేతనాలు ఇస్తామని చెప్పింది. ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలలతోపాటు స్థానిక సంస్థల ఆధీనంలోని పాఠశాలలు, మోడల్ స్కూల్స్‌లో స్కావెంజర్లను నియమించాలని సూచించింది. సమగ్ర శిక్ష పథకం ద్వారా డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ట్రస్టు (డీఎంఎఫ్‌టీ) ద్వారా స్కావెంజర్ల వేతనాలను ప్రతి మూడు నెలలకోసారి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చెల్లిస్తామని జీవోలో స్పష్టం చేసింది. విద్యార్థుల సంఖ్య ఆధారంగానే స్కావెంజర్లను నియమించాలని పేర్కొన్నది. పిల్లల నమోదు లేని పాఠశాలలకు స్కావెంజర్ల నియామకం అవసరం లేదని స్పష్టం చేసింది. 1నుంచి 30 మంది విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలకు స్కావెంజర్ల వేతనం కోసం నెలకు ₹3వేలు చెల్లించాలని పేర్కొన్నారు. 31నుంచి 100లోపు ఉంటే పిల్లలున్న స్కూళ్లలో స్కావెంజర్ల కోసం నెలకు ₹6వేలు, 101నుంచి 250మధ్య విద్యార్థుల సంఖ్య ఉంటే ₹8వే లు, 251 నుంచి 500 మధ్య ఉంటే ₹12వేలు, 501 నుంచి 750 మధ్య పిల్లలు ఉంటే ఆ పాఠశాలకు ₹15వేలు, 750పైన సంఖ్య ఉంటే ఆ పాఠశాలకు నెలకు ₹20వేల వేతనం ఇవ్వాలని నిర్ధారించారు.



As per the instructions of the District Collector sir, all the MEOs are requested to inform the HMs of PS/UPS/HS (enrollment is more than 15) and Principals of Model Schools to start the process of selection of Sanitary workers through AAPC as per the guidelines.
- to appoint one worker per school in the schools where enrollment is more than 15.
- Rs 3000/ per month will be paid from the month of November 2024.
- Amount will be credited into AAPC account.

08:13

*జగిత్యాల జిల్లా విద్యాధికారి నుంచి సెల్‌ఫోన్‌లో వచ్చిన మెసేజ్*



*జీవో ఎంఎస్‌లో పేర్కొన్న విద్యార్థుల ఎన్‌రోల్ ఆధారంగా ఇచ్చే నిధుల వివరాలు*

## జగిత్యాలలో నయా రూల్

ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లకు సంబంధించిన వేతనాల కోసం నిబంధనలు ఒకటి చెబుతుండగా, జగిత్యాల జిల్లాలోని విద్యాశాఖ అధికారులు మాత్రం నయా నిబంధనలను జారీ చేశారు. డీఈవో పేరిట ఇటీవల జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులకు సెల్‌ఫోన్ ద్వారా మెసేజ్‌లు చేరాయి. 'పదిహేను సంఖ్య కంటే అధికంగా ఉన్న పాఠశాలల్లో స్కావెంజర్ నియామకం చేపట్టాలి. నెలకు ₹3వేల వేతనం ఉంటుంది. నవంబర్ నుంచి స్కావెంజర్‌కు జీతం ఇస్తారు. వేతనం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అకౌంట్‌లో క్రెడిట్ అవుతుంది. ఈ సమాచారాన్ని మండల విద్యాధికారి పరిధిలో ఉన్న ప్రతి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులకు చేరవేయండి' అని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు చూసిన మండల విద్యాధికారులు తలలు పట్టుకుంటున్నారు.

## జిల్లాలో 820 పాఠశాలలు

జగిత్యాల జిల్లా విద్యాధికారి సెల్‌ఫోన్ మెసేజ్‌ల నేపథ్యంలో జిల్లాలోని చాలా మంది హెచ్ఎంలు తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో 820 పాఠశాలలు ఉండగా, దాదాపు 60వేల మంది అభ్యసిస్తున్నారు. సున్నా ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలలు 60 ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఒకటి నుంచి 30లోపు విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలలు 263 ఉన్నాయి. 31 నుంచి 100లోపు సంఖ్య ఉన్న స్కూళ్లు 321 ఉండగా, 101 నుంచి 200 మధ్య సంఖ్య ఉన్న పాఠశాలలు 121 ఉన్నాయి. 201 నుంచి 300 మధ్య సంఖ్య ఉన్న పాఠశాలలు 37 ఉండగా, 301 కంటే అధిక సంఖ్య కలిగిన పాఠశాలలు 18 ఉన్నట్టు విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. డీఈవో ఆదేశాల మేరకు 15 కంటే తక్కువ సంఖ్య ఉన్న పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించుకోరాదు. ప్రభుత్వం 1 నుంచి 30 మధ్య ఎన్‌రోల్ మెంట్ అని చెబితే, జగిత్యాల విద్యాధికారి మాత్రం 15 సంఖ్యకు పైన ఉన్న పాఠశాలలకు మాత్రమే అని పేర్కొనడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. ఇక విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా 15 మంది కంటే ఎక్కువగా పిల్లలు ఉన్న స్కూళ్లలో స్కావెంజర్లను నియమించుకోవాలనడం సైతం ప్రధానోపాధ్యాయులకు అర్థం కావడం లేదు. 31 నుంచి 100 మధ్య సంఖ్య ఉన్న పాఠశాలలు జిల్లాలో 321 ఉన్నాయి. వీటికి నిబంధనల ప్రకారం నెలకు ₹6వేలు మంజూరు కావాలి. కానీ, జిల్లా విద్యాధికారి మాత్రం ₹3వేలు అని చెప్పడంతో హెచ్ఎంలు బిత్తరపోతున్నారు. 101 నుంచి 200 మధ్య పిల్లలు ఉన్న పాఠశాలలు 121 ఉండగా, ఒక్కో స్కూల్‌కు నెలకు ₹8వేలు ఇవ్వాల్సి ఉంది. ఇక 250 సంఖ్య పైన ఉన్న పాఠశాలలు 30 వరకు ఉన్నాయి. వీటికి నెలకు ₹12వేల చొప్పున ఇవ్వాల్సి ఉంది. జిల్లాలో 700 సంఖ్యకు పైగా ఉన్న పాఠశాల సైతం కోరుట్లలో ఉంది. అయినా అన్నింటికీ నెలకు ₹3వేలు అని ప్రకటించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నది.

## తలలు పట్టుకుంటున్న హెచ్ఎంలు

జీవో ఎంఎస్ నంబర్ 21 ప్రకారం స్కావెంజర్లకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాల్సి ఉండగా, జిల్లా విద్యాధికారి నుంచి వచ్చిన సెల్‌ఫోన్ ఆదేశాలతో హెచ్ఎంలు తలలు పట్టుకుంటున్నారు. 50 మంది విద్యార్థుల కంటే అధికంగా సంఖ్య ఉన్న పాఠశాలల్లో కచ్చితంగా ఇద్దరు స్కావెంజర్లను నియమించుకోవాల్సిన పరిస్థితి ఉండగా, ఒక్కరితోనే ఎలా పరిశుభ్రతను నిర్వహించాలో అర్థం కావడం లేదని వ్యాఖ్యానిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా స్కావెంజర్ల వేతనాలు అంటూ స్పష్టమైన ఆదేశాలు ప్రభుత్వం ఇచ్చినా, ఇక్కడ ఇలాంటి నిబంధనలు ఎందుకు పెట్టారో అర్థం కావడం లేదని వారు వాపోతున్నారు. దీనికి తోడు ముఖ్యమంత్రి ప్రకటన నేపథ్యంలో జిల్లాలోని చాలా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు స్కావెంజర్లను ఆగస్టు నుంచే నియామకం చేసుకున్నారు. వారందరికీ ఆగస్టు నుంచి వేతనం వస్తుందన్న భావనలో ఉన్నారు. జీవో ఎం.ఎస్ 21లో సైతం పాఠశాలలకు పది నెలలకు సంబంధించి స్కావెంజర్లకు వేతనం ఇస్తామని స్పష్టంగా చెప్పారు. అయితే జగిత్యాల విద్యాధికారి మాత్రం 'స్కావెంజర్ల నియామకం చేపట్టండి. నవంబర్ నుంచి వేతనం ఇస్తాం' అని ఆదేశాల్లో పేర్కొనడంతో హతాశులవుతున్నారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మాసాలకు సంబంధించి స్కావెంజర్ల వేతనం ఎలా చెల్లించాలో తెలియడం లేదని వాపోతున్నారు. అయితే డీఈవోకు భయపడి, ఏ ఒక్క ప్రధానోపాధ్యాయుడు సెల్‌ఫోన్ ఆదేశాలపై మాట్లాడేందుకు ముందుకు రాలేకపోతున్నారు. కాగా, ఈ విషయమై కలెక్టరేట్ అధికారులు మాట్లాడుతూ, పూర్తిస్థాయిలో విద్యార్థుల లెక్కలు వేసి ప్రభుత్వానికి నివేదించామని, మనకు ఉన్న పాఠశాలల సంఖ్య, విద్యార్థుల సంఖ్య ప్రకారం నెలకు ₹46కోట్ల వరకు వ్యయమయ్యే అవకాశముందని అంచనాలు రూపొందించి నివేదించామంటున్నారు. ఏది ఏమైనా విద్యాధికారి ఆదేశాల నేపథ్యంలో హెచ్ఎంలు ఆందోళనకు గురవుతున్నారు. 30కి పైన విద్యార్థుల సంఖ్య ఉన్న చోట ఇద్దరు స్కావెంజర్లు, 100కు పైన సంఖ్య ఉంటే ముగ్గురు స్కావెంజర్లను నియమించుకోవాల్సి ఉంటుందని, ఒక్క స్కావెంజర్‌తోనే పాఠశాల పారిశుద్ధ్యం సాధ్యం కాదని వాపోతున్నారు. అలాగే మూడు నెలలకు సంబంధించిన వేతనం ఎలా చెల్లించాలో అర్థం కావడం లేదని, మళ్లీ ఉపాధ్యాయులు కలిసి పోగుచేసుకోని ఇవ్వాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

## కలెక్టర్ ఆదేశాల మేరకే : డీఈవో జగన్మోహన్‌రెడ్డి

15మంది విద్యార్థుల సంఖ్యకు మించిన పాఠశాలల్లో మాత్రమే స్కావెంజర్లను నియమించుకోవాలని, అలాగే ఒకే స్కావెంజర్‌ను ఏర్పాటు చేసుకోవాలని మండల విద్యాధికారులకు సెల్‌ఫోన్ మెసేజ్ ఇవ్వడంపై జిల్లావిద్యాధికారి జగన్మోహన్‌రెడ్డిని సంప్రదించగా..కలెక్టర్ ఆదేశాల మేరకే 15సంఖ్య కంటే ఎక్కువ ఉన్న పాఠశాలలకు స్కావెంజర్లను నియమించుకోవాలని చెప్పామన్నారు. నిధులు తక్కువగా మంజూరయ్యాయని కలెక్టర్ చెప్పారని, ఆ నేపథ్యంలోనే మెసేజ్‌లు ఇచ్చామని వెల్లడించారు.

# మాజీ సర్పంచులపై నిర్బంధం



*ఎల్లారెడ్డిపేట : పోలీసుల అదుపులో మాజీ సర్పంచులు*

కరీంనగర్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): పెండింగ్ బిల్లుల కోసం ఉద్యమిస్తున్న మాజీ సర్పంచులపై రాష్ట్ర సర్కారు ఉక్కు పాదం మోపుతున్నది. ఎక్కడికక్కడ నిర్బంధించి అణచివేస్తున్నది. సోమవారం మాజీ సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన 'చలో హైదరాబాద్' పేరిట పోరుబాటకు సిద్ధమవుతున్న కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని మాజీ సర్పంచులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. బలవంతంగా పోలీస్ స్టేషన్లకు తీసుకెళ్లి నిర్బంధించారు. మాజీ మహిళా సర్పంచులను సైతం అదుపులోకి తీసుకున్నారు. పరిస్థితిని ముందే ఊహించిన కొందరు సర్పంచులు ఒక రోజు ముందుగానే హైదరాబాద్ వెళ్లారు. సర్పంచుల ఫోరం సిరిసిల్ల జిల్లా మాజీ అధ్యక్షుడు మాట్ల మధు ఆధ్వర్యంలో కొందరు మాత్రమే వెళ్లారు. అప్పులు తెచ్చి, బంగారం కుదువబెట్టి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని, ఇప్పుడు అప్పులకు వడ్డీలు కట్టలేని స్థితిలో ఉన్నామని మాజీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన తమపై రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని ఆరోపిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ పెండింగ్ బిల్లులు ఇస్తామని నమ్మించి, తమతో ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ ఇపుడు తమను పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. తక్షణమే తమ పెండింగ్ బిల్లులు ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఒక్కో పంచాయతీలో ఒక్కో సర్పంచుకు ₹2 లక్షల నుంచి మొదలుకుని ₹20లక్షల వరకు రావాలని, తాము అప్పులు తెచ్చిన పైసలకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని మండెపల్లి మాజీసర్పంచ్ శివజ్యోతి ఆవేదన వ్యక్తంచేశారు.